# 29. అసతోమా సద్గమయ

చలమయ్యకు ఉన్నట్టుండి జ్ఞాపకం వచ్చింది.

అతని మేనమామపదిరోజుల కింద ఉత్తరం రాశాడు. ఆనాడు ఉదయం గోదావరిలో, అత్తను తీసుకొని వస్తున్నానని తప్పకుండా స్టేషనుకు వచ్చి ఇంటికి తీసుకెళ్లమన్నాడు.

ఆరోజు ఉదయం నుండి బంద్ పాటిస్తున్నారు. రాజకీయ పక్షాలు విజయవంతంగా బంద్ జరపాలని నిశ్చయించారు. బాంకులు మూస్తామన్నారు. ప్రభుత్వవాహనాలను తిరుగకుండా జాగ్రత్త పడ్డారు. బజారులు మూసేశారు. కార్యాలయాలకు పోయేవారిని కాళ్ళు విరగగొడతామని బెదిరిస్తున్నారు.

ఈ గొడవలో చలమయ్య అసలు సంగతి మరచిపోయాడు.

బంద్ జరుగుతుందని నాలుగు రోజుల నుండి పత్రికలలో పడుతున్నది. మేనమామకు ఈ సంగతి తెలిసి తప్పకుండా హైదరాబాదు ప్రయాణం వాయిదా వేసుకుని ఉంటాడని అనుకున్నాడు.

నూటికి తొంబై వంతులు మేనమామ రాడు.

ఒకవేళ వస్తే ?

పడరాని ఇబ్బందులు పడతాడు.

చలమయ్య మరి ఆలోచించలేదు. సైకిలు తీసుకొని సికిందరాబాదు స్టేషనుకు బయలుదేరాడు.

అతను స్టేషను చేరుకునేసరికి తొమ్మిదయింది.

గోదావరి మాత్రం సకాలంలోనే వచ్చింది.

పొద్దున్న ఆరుగంటల నుండి బంద్ మొదలవడం నుంచి ఆటోలు గాని, రిక్షాలు కాని తిరగలేదు.

ప్లాట్‌ఫారమ్ కూలీలను అడిగాడు. మేనమామ, అత్తల పోలికలను వాళ్లకు చెప్పాడు. కాని, ఏమీ ప్రయోజనం లేకపోయింది

చలమయ్య యిల్లు చేరేసరికి పదిగంటలయింది. తన యింటి ముందు ఒక రిక్షా ఆగింది. సామానుగాని, మనుషులు గాని లేరు. ఇంట్లోంచి కేకలు వినిపిస్తున్నాయి. రిక్షావాడు గొడవ పెడుతున్నాడు. మేనమామ యిచ్చిన అయిదు రూపాయలు చాలవంటున్నాడు.

పదిరూపాయలకు తక్కువ పుచ్చుకోనన్నాడు. బంద్‌నాడు ప్రాణాలకు తెగించి యిల్లు చేర్చినందుకు వాళ్లు సంతోషించాలి.

చలమయ్య తన జేబులోంచి అయిదు రూపాయలు తీసి మామయ్య యిచ్చిన దానికి చేర్చి, రిక్షావాడిని పంపించాడు.

"మామయ్య! సికిందరాబాదు స్టేషను నుండి మిమ్మల్ని టాంక్‌బండ్ దిగువకు తీసుకొచ్చాడు. మనం కూడా వాళ్ల కష్టసుఖాలు ఆలోచించాలి." అన్నాడు చలమయ్య

సామాను చిందరవందరగా వీధి వరండాలో పారేసి రిక్షావాడు వెళ్లిపోయాడు.

"ఒరేచలమయ్య! నాకంత లోకజ్ఞానం లేదనుకున్నావా! ఈ రిక్షావాడెక్కడ దొరికాడో తెలుసా? పక్కవీధిలో. అక్కడికీ యిక్కడికీ ఎంత దూరముంది? నా ప్రాణాలమీదికి మీ అత్త, చిన్నవి పెద్దవి పది సామాన్లు చేసింది. ఆమె రాణీ వారిలా రిక్షామీద - నేను సగం సామాను మోసుకుంటూ

" పక్కవీధివరకు ఎలావచ్చారు?"

"ఒక గంటసేపు సికిందరాబాదు స్టేషను వెలుపల అగచాట్లు పడుతుంటే ఒక ఆటోవాడు, మమ్మల్ని మా సామాన్లను సందులు గొందులలోంచి తీసుకుపోయి యిల్లు చేరుస్తానన్నాడు. ఒక్క నలభై రూపాయలు మాత్రమే అడిగాడు. దానికీ ఒప్పుకున్నాను. తీరా, రెండు వీధులు యిల్లుందనగా బంద్ చేస్తున్నవాళ్ళు, ఆటోడ్రైవర్ని బయటకీడ్చి తన్ని, మాసామాను నడివీధిలో పారేశారు. అక్కడో అరగంటసేపు తచ్చాడగా ఈ రిక్షావాడుదొరికాడు."

"ఏదయితేనేం, సామాను, మీరు, బంద్‌నాడు దెబ్బలు తినకుండా యిల్లు చేరుకున్నారు. దీనికి సంతోషించాలి. సామానులన్నీ సరిగా వచ్చాయో లేదో, ఒకసారి చూసుకొని, గదిలో పక్కన పెట్టండి."

అప్పుడు చలమయ్య మేనమామ సామానులు నాలుగుసార్లు లెక్క బెట్టాడు. కాళ్లు కడుక్కోడానికి ఇంట్లోకి వెళ్ళిన భార్యను పిలిచాడు.

"ఏమే! ఈసామానులు తొమ్మిదే ఉన్నాయి. మనతో తెచ్చిన సామాన్లు పది కదూ"

"సందేహం దేనికి. పదే తెచ్చాం- రెండు చేతి సంచులు, ఒక మూట, నా ట్రంకు పెట్టె... ఏదీనా ట్రంకు పెట్టి?"

ఆ ట్రంకు పెట్టి సామాన్లలో లేదు.

మేనమామ , అత్త నెత్తీ నోరు బాదుకొని నేలమీద చతికిలబడిపోయారు.

"అందులో ఏమున్నాయని?" చలమయ్య భార్య ప్రశ్నించింది.

"ఉండవలసినవన్నీ అందులోనే ఉన్నాయి తల్లీ- నా చంద్రహారాలు, రెండు పట్టుచీరెలు, నాలుగు కొత్త చీరలు.. అయ్యో!అయ్యో!!" అత్తయ్యకు కళ్లంట నీళ్లు వచ్చాయి.

"ఒరే చలమయ్యా! ఈ ప్రయాణానికి ఏవీ ఆటంకాలు లేవని, సులువుగా రిజర్వేషను దొరికిందని సంతోషించాం. ఇల్లు చేరేసరికి అంత సంతోషం మాయమయింది. ఏం చెప్పడం మీ అత్త చంద్రహారాలు, ఎనిమిదితులాలవి- అంటే ముప్పై వేలు పైగా- రెండు పట్టుచీరలు రెండు వేలు, కొత్తచీరలు రెండు వేలు వెరసి ముప్పై అయిదు వేలు దగ్గిరదగ్గిరగా పోయాయి. ఈ జన్మలో ఈలోటు తీర్చగలనా?"వాపోయాడు మేనమామ

ఎవరి ముఖాన్న కత్తివాటుకి కూడా నెత్తురు లేదు.

పదకుండుగంటలయింది.

చలమయ్య కొడుకు, పనిమీద మరోస్నేహితుడి దగ్గిరికి వెళ్ళి తిరిగి వచ్చేవరకు అన్నీ అలాగే ఉన్నాయి.

" నమస్కారం తాతగారు! నమస్కారం అమ్మమ్మగారు!" చలమయ్య కొడుకు పెద్దవాళ్లిద్దరినీ పలకరించాడు.

పెద్దవాళ్లు కాని, పక్కనున్న వాళ్లు కాని మౌనంగా ఉండటం చూసి చలమయ్య కొడుకు మళ్లా అన్నాడు.

"ఎవరూ మాట్లాడరేం? అందరూ క్షేమమేనా?"

"ఒరేదీక్షితులూ! ఏం క్షేమంరా! మీ అమ్మమ్మ పెట్టి పోయింది ముప్పై అయిదువేల విలువైన సామాన్లు దానితోపాటు పోయాయి. మళ్లా నాబతుక్కి వాటిని సంపాదించగలనా?"

దీక్షితులు ఒక క్షణం ఊరుకున్నాడు.

తాతగారు చెప్పి న సంగతంతా విన్నాడు.

"తాతగారూ! అధైర్యపడకండి. రేపు, పోయిన పెట్టె గురించి ప్రయత్నం చేద్దాం. పొద్దుటినుంచి స్నానం, పానం లేకుండా ఉన్నట్లు కనిపిస్తున్నది. రండి! సామాన్లు నాగదిలో పెడుతున్నాను. మరేం బెంగ పెట్టుకోకండి!"

"ఎలా తాపీపడగలం? మా సర్వస్వం పోతే ఏం చేయడం?"

"అమ్మమ్మగారూ! ఇవాళ రాత్రి వరకు బంద్ జరుగుతుంది. ఎటువంటి ప్రయత్నం చేయడానికి వీలుపడదు. రేపు తప్పకుండా అన్ని ప్రయత్నాలు చేద్దాం. మీ పెట్టె దొరుకుతుందనే నమ్మకం నాకుంది!"

"ఒరే దీక్షితులు! పారిన నీరు, పోయిన వస్తువులు దొరకడం సాధ్యం కాదు. ఈలోకంలో అంతమంచి వాళ్లు ఎక్కడున్నారు.?"

"మీరు ఆటో డ్రైవరుకి సరియైన అడ్రసు చెప్పారా?"

"నాకు యిల్లు తెలుసు- చూపిస్తాను పదమని మీతాతగారు వాడితో అన్నారు."

"అమ్మమ్మ గారూ, అయినా పర్వాలేదు- రేపటి వరకు కొంచెం..."

" ఒరే దీక్షితులు - ఏమీ శ్రమపడకుండా ముఫ్ఫై అయిదువేల రూపాయలు దొరికితే ఎవడు వదులుకుంటాడు."

"తాతగారూ! లోకంలో అందరూ మోసం చేసేవాళ్లేనా?"

"ఒరే! నూటికో పదిమంది ఉంటే ఏంప్రయోజనం"

"నూటికి ఒకడు మంచివాడున్నా, తక్కినవాళ్లను దారిలోకి తెస్తాడు. నాకు మనుష్యుల మంచితనం మీద అచంచలమైన విశ్వాసం. ఈ బంద్‌లు, కర్ఫ్యూలు నిత్యజీవితంలో భాగమయాయి. గడ్డు పరిస్థితులలో బ్రతకడం నేర్చుకోవాలి. మనకు ప్రభుత్వం సహాయం చేయదు. మానవుడే మానవుడికి సహాయం చేయవలసిన వాడు."

"దీక్షితులు! ఇవాళకి సంగతి పక్కకి బెడదాం. రేపునువ్వు చెప్పినట్లు ప్రయత్నాలు చేద్దాం."

అప్పటికి తాత్కాలికంగా సమస్యను వెనుక బెట్టారు.

మర్నాడు ఎనిమిది గంటలకు దీక్షితులు, తాతగారు, అమ్మమ్మగారు బయలు దేరారు. ఆటో నంబరు తెలియదు. అన్ని ఆటోలు ఒకలాగే కనిపించాయి.

దీక్షితులు ఎవరినడిగినా తెలియదని చెప్పారు.

రమారమి తొమ్మిదిగంటలకు ముగ్గురు ఆ ప్రాంతాలలో నున్న పోలీసు స్టేషనుకు పోయారు. పగలు డ్యూటీ ఇనస్పెక్టరు గారి టేబిలు మీద ఒక చిన్న సూట్‌కేసు ఉంది. ఒక ఆటోడ్రైవరతనితో మాట్లాడుతున్నాడు.

"నాపేరు కాసులయ్య సార్! నిన్న నాఆటోలో ఇద్దరు పెద్దవాళ్లను సామాను సికిందరాబాదు స్టేషను నుంచి తెచ్చాను సార్- సగందూరంలో బంద్ చేస్తున్న వాళ్లు నాబండి ఆపి, నన్ను కిందకు లాగి, తన్ని, ఆ ముసిలి వాళ్ల సామాన్లు నడివీధిలో పారేశారు. - ఈ సూట్‌కేసు, సీటువెనుక ఉండిపోయింది. వారెవరో నాకు తెలియదు. అడ్రసు కూడా వాళ్లు సరిగా చెప్పలేదు. మీరు..."

ఇంతవరకే కాసులయ్యచెప్పాడు.

"దీక్షితులూ! ఈ పెట్టి మనదేరా" అన్నారు తాతగారు.

అమ్మమ్మగారు అదేమాటన్నారు.

ఆటోడ్రైవరు పక్కకు తిరిగి, ఆపెట్టి వచ్చిన వాళ్ళదే అన్నాడు.

అయినా ఇనస్పెక్టరుగారు పెట్టిలోపల వస్తువుల వివరాలు తెలుసుకొని తాళంతీయించి, అన్నీ సరిగా ఉన్న తరువాత పెట్టి ఇచ్చి వేస్తూ అన్నారు.

"మీరు సరియైన వేళకే వచ్చారు. ఒకసారి  కేసు నమోదయితే, మీ పెట్టి కోర్టులోనే ఆరు నెలల తరువాత యిస్తారు. అందులో ఏముంటాయో దేవుడికే ఎరిక. మీరు చాల అదృష్టవంతులు''

తాతగారు ఆటోడ్రైవరుకో ఏభైరూపాయలియ్యబోయారు. కాని, కాసులయ్య పుచ్చుకోలేదు. పెద్ద వాళ్లకు నమస్కారం చేసి వెళ్ళి పోయాడు.

సాయంకాలం చలమయ్య యింటికి వచ్చేసరికి అందరి ముఖాలలోను సంతోషమే కనిపించిది.

చలమయ్య మేనమామ, అత్తయ్య పదిరోజులుండి వెళ్లిపోయారు.

బతుకుమళ్లా గాడిలోపడింది.

ఆవేళ ఆఫీసులో చాలపని ఉండి అతను యిల్లు చేరుకునే సరికి రాత్రి తొమ్మిదయింది. భోజనం చేసి వరండాలో మంచం వేసుకుని పడుక్కునే సరికి పదయింది.

సాధారణంగా అతను మంచంమీద చేరబడగానే అతను నిద్రపోతాడు.

ఆలోచనలతో సతమతమయి మంచం మీద చాలసేపు దొర్లాడు.

ఇంట్లో, ఈ మధ్య జరిగిన సంగతులు ఒకటీ ఒకటీ జ్ఞాపకానికి రాసాగాయి.

ఇది జరిగి వారం రోజులయింది.

చలమయ్య కు ఒక్కతే కూతురు. ఆమె పేరు ఉమ. ఆమె బియ్యే చదువుకుంటున్నది.

చలమయ్య స్నానం చేసి, పక్కగదిలో జపం చేసుకుంటున్నాడు.

ఉమ ఆమె స్నేహితురాలు ఏదో విషయం గురించి గట్టిగానే మాట్లాడుకుంటున్నారు.

"ఉషా! నీకు మరోసారి చెప్తున్నాను. నువ్వు పై మెరుగులు చూసి మోసపోయావు. ఈ దౌర్భాగ్యుడు, సుధీర్,నిన్నే కాదు, మరో నలుగురు అమ్మాయిలును కూడా, ఈవిధంగా ప్రేమలేఖలు వ్రాసి, వంచిస్తున్నాడు. వాడు విసిరిన గాలానికి ఏదో చేప తగలక మానదా అని వాడి వాదన. పదిమంది రౌడీలను వెనక వేసుకొని వాడు వీర విహారం చేస్తున్నాడు. నువ్వు భయపడకు. మీరు నలుగురూ ప్రిన్సిపాల్‌గారి దగ్గరకి వెళ్లి జరిగినదంతా చెప్పండి. భయపడకండి.

చలమయ్య తనకూతురి ధైర్యానికి ఆశ్చర్యపోయాడు. తాను మంచి దారిని పోడమే కాకుండా, మరొకరిని కూడా ఆదారికి తీసుకొస్తున్నది.

రెండురోజుల కింద మరొక సంగతి అతను తెలుసుకున్నాడు.

అతను పండుగకు చీర కొనుక్కొమని భార్యకు మూడు వందల రూపాయలిచ్చాడు. కొడుక్కి ఉద్యోగమయి ఆరు నెలలయింది. ప్రతినెల వాడు తల్లికి ఏభైరూపాయలిస్తున్నాడు. మంచి జరీ చీర అయిదు వందలిచ్చి కొనుక్కుంటానని ఆమె చెప్పింది.

మొన్న రాత్రి ఏవో మాటల సందర్భంలో అతను చీర గురించి అడిగాడు. పారుగావిడ కొడుకుకు అర్జంటుగా పరీక్షకు డబ్బు చాలకపోతే, తన దగ్గిరున్న సొమ్ములో నాలుగు వందలిచ్చినట్లు అతనితో చెప్పింది.

" నువ్వు చెప్పింది బాగానే ఉంది. వాళ్లు ఆ డబ్బు తిరిగి ఇవ్వడానికి రెండు మూడు నెలలు పడుతుంది. అంటే, ఈ పండుక్కి నీకు కొత్త చీర ఉండదన్న మాట." అన్నాడతను.

"మీరు చెప్పారు కదా, ఎప్పుడు కొత్త చీర కట్టుకుంటే ఆనాడే పండుగని"

చలమయ్య దొర్లుతున్నాడు.

ఇంకా నిద్ర రాలేదేమి?

ఉన్నట్టుండి అతని కోసంగతి జ్ఞాపకం వచ్చింది.

మధ్యాహ్నం రెండు గంటల వేళ ఆఫీసులోఅతనికో కబురు తెలిసింది.

విద్యార్థులు కోటా పద్ధతికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. కాలేజీకి బయలుదేరిన సీతారామయ్య కొడుకుని వాళ్లు గుంపులోకి లాక్కున్నారు. నినాదాలు- కేకలు- అరుపులు- ఆ సంరంభంలో ఎవడో సీతారామయ్య కొడుకు మీద కిరసనాయిలు పోసి అగ్గిపుల్ల ముట్టించాడు. అందరూ చెల్లా చెదరయారు. అప్పటికీ ఆకుర్రాడు ధైర్యంగా మంటలను ఆర్పడానికి నేలమీద పొర్లాడు. ఒంట్లో కొంత భాగం కాలిపోయింది. నలుగురి సహాయంతో నర్సింగ్ హోములో చేర్చారు.

సీతారామయ్యకు రక్తపు పోటుంది. డయబెటీస్ ఉంది, అసలే గాభరా మనిషి. ఉన్న ఒక్క కొడుకుని బలవంతంగా స్వార్థపరులు సజీవంగా తగలబెడుతూంటే అతనేం చేయగలడు. ఉన్న ఒక్క కొడుక్కి ఏది జరిగినా అతడు బతకడు.

సీతారామయ్య కొడుకును బ్రతికించడానికి డాక్టర్లు శ్రమపడుతున్నారు. సీతారామయ్యను దక్కించుకోడానికి తనవంటి స్నేహితులు అవుసరం. ఆ భయస్తుడికి ధైర్యం చెప్పి, అతనితోపాటు నర్సింగ్ హోములో సాయముంటే...

చలమయ్య మంచం మీంచి లేచాడు. బట్టలు వేసుకున్నాడు.

భార్యను లేపి, సంగతి చెప్పి, వీధి తలుపు వేసుకోమన్నాడు.

రోడ్డు మీదకు వచ్చి క్షణం నిలబడ్డాడు.

అనంతమైన ఆకాశం పైన మెరిసే చుక్కలు

చలమయ్య చేతులు జోడించి అన్నాడు.

" ఓ భగవంతుడా! మా సీతారామయ్య అమాయకుడు. అతని కొడుకు చాల తెలివైన వాడు. వీళ్లిద్దరూ ఏనేరమూ చేయలేదు. అతని ఒక్క కొడుకునీ రక్షించు తండ్రీ!"

జాగృతి - దీపావళి సంచిక

✷